సాక్షి
మంచిర్యాల
గురువారం । 29 । ఆగస్టు । 2024



కొత్తకాలనీల్లో సమస్యల తిష్ట

క్యాతనపల్లి మున్సిపాల్టీలోని కొత్తకాలనీల్లో సమస్యలు తిష్టవేశాయి. వసతుల కల్పనలపై పట్టణ పాలకవర్గం, అధికారులు దృష్టి సారించడం లేదనే ఆరోపణలున్నాయి. 9లో▸



పీహెచ్‌సీ సందర్శన

తాండూర్: స్థానిక పీహెచ్‌సీని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ బుధవారం సందర్శించారు. వైద్య సిబ్బందితో సమావేశమై నేషనల్ హెల్త్‌మిషన్‌పై చర్చించారు. డెప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధాకర్, వైద్యురాలు ఝాన్సీ పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. రాత్రివేళ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

4నుంచి సదరం శిబిరం

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సెప్టెంబర్ 4నుంచి సదరం శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. మీ సేవలో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత తేదీల్లో సదరం నూతన సర్టిఫికెట్, కాల పరిమితి ముగిసిన సర్టిఫికెట్ పునరుద్ధరణకు హాజరు కావాలని తెలిపారు. సెప్టెంబర్ 4, 9, 20, 28న శారీరక వికలాంగులు-ఆర్థో(65 మంది), సెప్టెంబర్ 13, 27న కంటిచూపు(40 మంది), సెప్టెంబర్ 17, 24న మూగ, చెవుడు(65 మంది), 27న మానసిక వికలాంగుల(65మంది)కు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. గతంలో స్లాట్ బుక్ చేసుకుని వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న వారి మొబైల్ నంబరుకు ఏ రోజు రావాలనే సమాచారం వస్తుందని పేర్కొన్నారు.

ఆశ్రమ పాఠశాల సిబ్బందికి షోకాజ్ నోటీసులు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలికల పాఠశాల సిబ్బంది ఏడుగురికి ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 27న పాఠశాల ఆకస్మిక తనిఖీ నిర్వహించి నోటీసులు జారీ చేశారని ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. ఇంచార్జి హెచ్‌డబ్ల్యూవో శోభారాణి కింది స్థాయి సిబ్బంది స్కావెంజర్ సంధ్యారాణి, ఏఎన్‌ఎం సుమిత్ర రిజిష్టర్‌లో సంతకాలు తీసుకోవడం లేదని, మరో ముగ్గురు సిబ్బంది సుజాత, లక్ష్మి, రమ్యశ్రీ వ్యక్తిగత సమస్యలతో విధులకు హాజరు కాకుండా బినా మీ వ్యక్తులతో పనులు చేయిస్తున్నారని, బది లీపై వచ్చిన సంక్షేమాధికారి మల్లారెడ్డి విధుల్లో చేరినా మంచిర్యాలలో విధులు నిర్వర్తిస్తున్నారని షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలి పారు. వెంటనే వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలు

బెల్లంపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలు సాగిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. బుధవారం బెల్లంపల్లి పట్టణ సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 1 నుంచి 7వరకు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని, 11 నుంచి 17వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరుల జ్ఞాపకాలను స్మరిస్తూ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎం.వెంకటస్వామి, బి.పూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నర్సయ్య, శ్రీనివాస్, పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి, బెల్లంపల్లి మండల కార్యదర్శి బి.లక్ష్మీనారాయణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్, నాయకులు పాల్గొన్నారు.

కవ్వాల్‌లో శిక్షణ రేంజ్ అధికారుల పర్యటన



మైసమ్మ కుంట వద్ద శిక్షణ రేంజ్ అధికారులు

జన్నారం: దూలపల్లి ఫారెస్ట్ అకాడమీకి చెందిన 11వ బ్యాచ్ శిక్షణ రేంజ్ అధికారులు 37 మంది బుధవారం కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో పర్యటించారు. ఇందనపల్లి ఫారెస్ట్ అధికారి హఫీజొద్దీన్ ఆధ్వర్యంలో ఇందనపల్లి రేంజ్‌లో ఘనిశెట్టి కుంట, మైసమ్మకుంట, బర్తన్‌పేట్ బీట్, బేస్‌క్యాంప్ ప్రాంతాలు పరిశీలించారు. గడ్డి క్షేత్రాలు, నీటికుంటలు, జంతువుల రక్షణ చర్యలు, స్మగ్లింగ్ నిరోధంపై వివరించారు. అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ బీ.వెంకటేశ్వర్‌రావు గడ్డి రకాలు, గడ్డి క్షేత్రాల నిర్వహణపై తెలియజేశారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఐకేపీ, వీవోఏ ఉద్యోగుల సంఘం(సీఐటీయూ) ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఐకేపీ, వీవోఏలు గత 20ఏళ్లుగా గ్రామాల్లో మహిళల అభివృద్ధికి స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేస్తూ ఆర్థికంగా, సామాజికంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రోజురోజుకు పని ఒత్తిడి పెంచుతున్నారని, అతి తక్కువ వేతనంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ.26 వేలు, ప్రతీనెల సక్రమంగా చెల్లించాలని తెలిపారు. సీసీలుగా పదోన్నతి కల్పించాలని, తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు కుమార్, రాము, లింగంపల్లి వెంకటేష్, పోషం, సమ్మన్న, లక్ష్మణ్, భీమరాజ్, రజిత, భాగ్య, లావణ్య, రాజలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

దోమతో ముప్పు !



ఇది జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న రాళ్లవాగు పరిసర ప్రాంతం. ఇక్కడ కొందరు ఇష్టారీతిన చెత్తను వాగులో, పరిసర ప్రాంతాల్లో పారవేస్తున్నారు. రోజువారీగా పోగైన వ్యర్థాలను ఇంటి ముందుకు వచ్చిన చెత్త తరలించే వాహనంలో వేయకుండా ఇలా పబ్లిక్ ప్రదేశాల్లో వేస్తూ వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. విపరీతమైన దుర్వాసనతో ఉన్న ఈ వ్యర్థాలను తొలగించడం మున్సిపాలిటీ సిబ్బందికి కష్టంగా మారుతోంది. వర్షాలు కురిసినప్పుడు ఇదంతా గోదావరిలో కలిసి నీరు కలుషితమవుతోంది. ఓ వైపు సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో జాగ్రత్తలు పాటించాల్సి ఉన్నా అవేవీ పట్టించుకోక ప్రజారోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు.



జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ కాలనీలో రోడ్డుపై నిలిచిన నీరు

- సవాల్‌గా పారిశుధ్య నిర్వహణ
- దోమల నియంత్రణ లేక రోగాలు
- పౌరుల్లోనూ లోపిస్తున్న సామాజిక బాధ్యత
- పట్టణాలకు పొంచి ఉన్న వ్యాధుల వ్యాప్తి



లక్సెట్టిపేట ఆంధ్ర కాలనీలో రోడ్డుపై మురుగు నీరు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీజనల్ వ్యాధుల తాకిడితో జిల్లాలో అనేక మంది రోగాల బారిన పడుతున్నారు. ఏటా వానాకాలంలో దోమలు, కీటకజనిత వ్యాధులతోనే ప్రజలు సతమతం అవుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జ్వరాలతో రోగుల తాకిడి పెరుగుతోంది. ఇంటి పరిసరాలు, కాలనీలు, పబ్లిక్ ప్రాంతాలు, ఖాళీ ప్లాట్లలో పారిశుధ్య నిర్వహణ లోపంతో అనేక రోగాల వ్యాప్తికి కారణమవుతున్నాయి. అధిక జనాభా ఉండే పట్టణాల్లో స్వచ్ఛత కార్యక్రమాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. పాలకవర్గాలకు సరిపడా బడ్జెట్ లేక అరకొర నిధులతోనే అధికారులు సర్దుబాటు చేస్తున్నారు. దీంతో పరిశుభ్రత కొరవడుతోంది. రోజు వారీగా ఇళ్లలో చెత్త సేకరణ, మురుగు నీటి పారుదల, రోడ్లపై చెత్త, వానాకాలంలో రోడ్లు, ఖాళీ జాగాల్లో నీటి నిల్వలు, పరిసరాల్లో స్వచ్ఛత లేక దోమల సంఖ్య పెరుగుతోంది.

నామమాత్రంగానే..

మున్సిపాలిటీల విధుల్లో కీలకమైన పారిశుధ్య నిర్వహణ నామమాత్రంగానే సాగుతోంది. జిల్లాలో ఏడు మున్సిపాలిటీలు మంచిర్యాల, నస్పూర్, లక్సెట్టిపేట, చెన్నూరు, మందమర్రి, క్యాతనపల్లి, బెల్లంపల్లి పట్టణాల్లో నామమాత్రంగానే పారిశుధ్య నిర్వహణ చర్యలు కొనసాగుతున్నాయి. ప్రతీ శుక్రవారం డ్రై డేను కొనసాగిస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో చేయడం లేదు. ఖాళీ ప్లాట్లు, మురికి కాలువలు, శివారు కాలనీల్లో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దీంతో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఎల్లోఫీవర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. వీటితోపాటు కలుషిత నీటితో జ్వరాలు, డయేరియా ప్రబలేందుకు ఆస్కారం ఏర్పడుతోంది.

ఫాగింగ్ అంతంతే..

జిల్లా కేంద్రంలో 36 వార్డులకు రెండే ఫాగింగ్ యంత్రాలు ఉన్నాయి. పట్టణమంతా దోమల వ్యాప్తి నిర్మూలించడం కష్టంగా మారింది. ప్రైవేటు, ప్రభుత్వ ఆస్పత్రుల పరిసరాల్లో అపరిశుభ్రతతో రోగాలకు కారణమయ్యే దోమలు సమీప కాలనీల్లోకి వస్తున్నాయి. మున్సిపాలిటీ నుంచి నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, దోమల మందును పిచికారీ చేస్తూ ప్రతి శుక్రవారం 'మెప్మా' సభ్యులతో డ్రై డేను నిర్వహిస్తున్నారు. కొన్ని చోట్లనే డ్రైనేజీలను శుభ్రపరిచి బ్లీచింగ్ పౌడర్ వేస్తున్నారు.

- బెల్లంపల్లి మున్సిపాలిటీలో ఇటీవల కొత్తగా రెండు ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేసి, వార్డుల వారీగా మురికినీటి కాలువలు, ఇళ్ల పరిసరాల్లో ఫాగింగ్ చేస్తున్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా ఫాగింగ్ పూర్తికాలేదు. ప్రతీ రోజూ 34 వార్డుల్లో పారిశుధ్య పనులు జరగడం లేదు. బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నారు. సమస్యాత్మక వార్డుల్లో మురికి కాలువల్లో పూడిక తీయిస్తున్నారు.
- చెన్నూర్ మున్సిపాలిటీలో దోమల నివారణ, శానిటేషన్ కోసం రూ.3 లక్షల బడ్జెట్ కేటాయించారు. దోమల నివారణ చర్యలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. మొత్తం 18 వార్డుల్లో వారానికి ఒక్కరోజు మాత్రమే ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు.
- క్యాతనపల్లి పరిధిలో దోమల నివారణకు రెండు ఫాగింగ్ యంత్రాలతో ఉదయం, సాయంత్రం ఫాగింగ్ చేస్తున్నారు. 22 వార్డుల్లో పారిశుధ్య సిబ్బంది కొరత ఉండడంతో పారిశుధ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో సాగడం లేదు.
- లక్సెట్టిపేట పరిధిలోని దోమల నివారణకు సాధారణ నిధుల నుంచి రెండు ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేశారు. వీధుల్లో డ్రైనేజీ సౌకర్యం సరిగా లేక దోమల నియంత్రణ సాధ్యం కావడం లేదు.
- మందమర్రి పట్టణంలో సింగరేణి ప్రాంత పరిధిలో చాలా కాలనీల్లో అపరిశుభ్రత నెలకొంది. నస్పూర్ పట్టణంలోనూ పారిశుధ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో చేయడం లేదు.

డంపింగ్ యార్డు తరలింపేది..?

- 10 ఎకరాల స్థలం గుర్తింపు
- ఎన్నికల కోడ్‌తో ఆలస్యం
- ఈగలు, దోమలతో సతమతం
- వ్యాధుల బారిన కాలనీవాసులు



ఆండాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డులో వేసిన చెత్త

మంచిర్యాలటౌన్: మంచిర్యాల గ్రేడ్-1 మున్సిపాల్టీలో చెత్త డంపింగ్‌యార్డుకు ప్రతీసారి స్థలం కేటాయిస్తున్నా తరలించడంలో ఇబ్బంది ఎదురవుతోంది. దీంతో కొన్నేళ్లుగా ఆండాళమ్మ కాలనీలోనే డంపింగ్ యార్డు నిర్వహించాల్సి వస్తోంది. ప్రతియేటా వర్షాకాలంలో ఈగలు, దోమలతో పరిసర ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతుండగా.. చలికాలం, వేసవికాలంలో కాలుతున్న చెత్త నుంచి వెలువడే పొగతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఏడాది పొడవునా వ్యాధుల బారిన పడుతున్నారు. నస్పూర్‌లోని 10ఎకరాల స్థలం డంపింగ్ యార్డు కోసం కేటాయించినా ఎంపీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మున్సిపల్ ఆధీనంలోకి తీసుకోవడంలో ఆలస్యమైంది. ప్రస్తుతం స్థలాన్ని అప్పగించి, అందుకు సంబంధించిన పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధం చేస్తుండగా.. ఈ ప్రక్రియ ముగిసే సరికి కొంత సమయం పట్టే అవకాశం ఉంది. చెత్తను బయోమైనింగ్ ద్వారా ఎరువుగా మార్చే ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. బయోమైనింగ్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డంపింగ్ యార్డులన్నీ గత ఏడాది కాంట్రాక్టు అప్పగించారు. దీంతో మంచిర్యాలలో పరిశీలన పూర్తి చేసినా పనులు చేపట్టడం లేదు. యార్డులో చెత్త పేరుకుపోయి కుప్పలుగా మారుతోంది. మున్సిపల్ కార్మికులు తడి, పొడి చెత్తను ఇళ్లలోనే వేరు చేసి సేకరించకపోవడం, రెండింటినీ కలిపి సేకరించి యార్డుకు తరలించడం కూడా ఇబ్బందిగా మారుతోంది.

రోజుకు 44 మెట్రిక్ టన్నుల చెత్త

మున్సిపాల్టీలోని 36వార్డుల్లో ప్రతీ రోజు 44మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. ఆండాళమ్మ కాలనీలో ఉన్న డీఆర్‌సీసీ కేంద్రంలోనే డంపింగ్ చేస్తున్నారు. ఇక్కడ తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువులు తయారు చేయాల్సి ఉండగా.. అదే కేంద్రాన్ని చెత్త డంపింగ్ యార్డుగా మార్చేశారు. పెరుగుతున్న జనాభాతోపాటు రోజువారీ చెత్తా పెరిగిపోతోంది. సమీపంలోని కాలనీల్లో దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాకాలం కావడంతో వ్యాధుల బారిన పడుతున్నారు. పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినలేకపోతున్నారు. డంపింగ్‌యార్డును మరోచోటుకు మార్చాలని సమీప కాలనీ ప్రజలు డిమాండ్ చేయడంతో నస్పూర్‌లో పదెకరాల స్థలం సేకరించి సిద్ధం చేస్తున్నారు. పట్టణంలోని ప్రజలకు తడి, పొడి చెత్తను వేరు చేయడంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. తడి, పొడి చెత్త వేర్వేరుగా వేసేందుకు ఇంటింటికీ రెండు డబ్బాలు ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోయింది. యార్డులో వేస్తున్న చెత్తను రీయూజ్ చేయకపోవడంతో గుట్టలుగా పేరుకుపోతోంది. ఒక్కోసారి మంటలు అంటుకుని పొగలు వస్తున్నాయి. పొగతో సమీపంలోని ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

కొద్ది రోజుల్లోనే తరలిస్తాం



మంచిర్యాల మున్సిపాలిటీకి శాశ్వత డంపింగ్ యార్డు కోసం నస్పూరులోని సింగరేణి స్థలం 10 ఎకరాలు కేటాయించారు. మరికొద్ది రోజుల్లోనే ఆ స్థలంలోనే చెత్తను డంపింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను బయోమైనింగ్ చేసి పూర్తిగా తొలగించేందుకు ఇటీవల ఏర్పాట్లు పూర్తి చేశాం. వర్షాలు తగ్గుముఖం పట్టగానే బయోమైనింగ్ ద్వారా చెత్తను మొత్తం రీసైక్లింగ్ చేసి ఆ ప్రాంతం పరిశుభ్రంగా చేయిస్తాం.

– మారుతిప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శివకృష్ణ

బెల్లంపల్లి: భూసారాన్ని పెంపొందించుకునేందుకు రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని గణనీయంగా తగ్గించాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోట శివకృష్ణ అన్నారు. బుధవారం కేవీకే ప్రాంగణంలో మంచిర్యాల, కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాల రైతులకు పంట వ్యర్థాల నుంచి వర్మీ కంపోస్టు తయారీ విధానం, తేనేటీగల పెంపకంలో చేపట్టాల్సిన మెలకువలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల సాగులో రైతులు విచక్షణారహితంగా రసాయనిక ఎరువులు వాడుతున్నారని అన్నారు. ఈ తీరు వల్ల భూమి సారాన్ని కోల్పోయి నిస్సత్తువగా తయారవుతుందని, తద్వారా పంట దిగుబడులు గణనీయంగా తగ్గే అవకాశాలు ఉంటాయని తెలిపారు. భూసారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపై ఉందన్నారు. వానపాముల ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేసుకోవాలని తెలిపారు. వంద రోజుల వీక్షిత్ భారత్ ప్రణాళికలో భాగంగా ఈ నెల 31వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు తిరుపతి, స్రవంతి, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

జ్వరాల నివారణకు ప్రత్యేక చర్యలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- చెన్నూర్ ఆస్పత్రి సందర్శన

సాక్షి ఎఫెక్ట్..



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూర్: జిల్లా వ్యాప్తంగా విష జ్వరాలు, డెంగీ జ్వరాలు ప్రబలుతున్నాయని, నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 'విజృంభిస్తున్న విష జ్వరాలు', 'విస్తరిస్తున్న డెంగీ జ్వరాలు' శీర్షికన గత రెండ్రోజులుగా 'సాక్షి'లో ప్రచురితమైన వరుస కథనాలకు కలెక్టర్ స్పందించారు. బుధవారం ఆయన చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్యుల హాజరు పట్టిక, జ్వర బాధితుల వివరాలు పరిశీలించారు. అనంతరం వార్డుల్లో పర్యటిస్తూ రోగులతో మాట్లాడారు. వైద్యులు అందుబాటులో ఉంటున్నారా, వైద్యసేవలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సూచించిన మందులు సక్రమంగా వాడుతూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని రోగులకు అన్నారు. ఆస్పత్రి ప్రాంగణంతోపాటు వార్డులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని వైద్య సిబ్బందికి సూచించారు. వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వార్షిక రుణ లక్ష్యాలు సాధించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, బ్యాంకర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా వార్షిక రుణ లక్ష్యాలు సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం సమీకృత కలెక్టరేట్‌లో లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం మహ్మద్ జయూర్ రహమాన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం రాధాకృష్ణన్, నాబార్డ్ డీడీఎం అబ్దుల్ రవూఫ్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజనల్ మేనేజర్ పి.మురళీమోహన్‌రావు, టీజీబీ ఆదిలాబాద్ రీజనల్ మేనేజర్ ప్రభుదాస్‌లతో కలిసి వివిధ బ్యాంకుల అధికారులతో రుణ లక్ష్య సాధనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పంట రుణం కింద రూ.525 కోట్లు, వ్యవసాయ రంగానికి రూ.796 కోట్లు అందిస్తామని తెలిపారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.262 కోట్లు, గృహ నిర్మాణ రుణాల లక్ష్యం రూ.91.32 కోట్లు, విద్యారుణాలు రూ.7.06 కోట్లు, వివిధ రంగాల రుణాల లక్ష్యం మొత్తం రూ.291 కోట్లు అందించాలని తెలిపారు.

ఆర్‌బీఐ క్విజ్ పోటీలు

మంచిర్యాలఅగ్రికల్చర్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 90వ సంవత్సరంలోకి అడుగు పెట్టిన సందర్భంగా ఆర్‌బీఐ 90 క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్‌బీఐ ఏజీఎం మహ్మద్ జయూర్ రహమాన్, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, వివిధ బ్యాంకుల అధికారులతో కలిసి క్విజ్ పోటీల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనదాల్చిన వారు ఇద్దరు ఒక బృందంగా ఏర్పడి https://www.rbi90quiz.in వెబ్‌సైట్‌లో రిజిష్టర్ చేసుకోవాలని తెలిపారు.

పారిశుధ్య పనులు ప్రతీరోజు చేపట్టాలి

కోటపల్లి: గ్రామాల్లో ప్రతీరోజు పారిశుధ్య పనులు చేపట్టాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండలంలోని ఎడగట్ట, ఎసన్‌వాయి గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య పనులు పరిశీలించి సూచనలు చేశారు. రోడ్లపై ఉన్న చెత్తాచెదారం, పశువుల పేడను చూసి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వాయిపేట పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. కోటపల్లి కేజీబీవీలో సౌకర్యాలపై ఎస్‌వో హరితను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతు చేయిస్తామని తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, కార్యదర్శులు సంతోష్, తాజ్ పాల్గొన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై నిఘా

- పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- రామగుండం సీపీ శ్రీనివాసులు



సూచనలు చేస్తున్న సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీసు కమిషనర్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం రామగుండం పోలీసు కమిషనరేట్ ఆవరణలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పని చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి విపత్కర పరిస్థితుల్లో శత్రుమూకలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు, మావోయిస్టుల కార్యకలాపాల నిరోధానికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ శ్రీనివాసులు మాట్లాడుతూ మావోయిస్టులు సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా నివారించాలని అన్నారు. ఆయుధ వినియోగం, అబూష్, వాహనాల అంబూష్, టాక్టికల్ మూమెంట్, పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రాంతం మ్యాప్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సాంకేతిక అంశాలపై శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జ్వరాల బారిన పడి చస్తున్నాం..!

- ఇప్పుడా సారూ వచ్చేది..
- కొల్లూరులో ఎమ్మెల్యే వివేక్‌ను నిలదీసిన మహిళలు



ఎమ్మెల్యే వివేక్‌ను నిలదీస్తున్న మహిళలు

కోటపల్లి: 'రోడ్లు లేవు.. నాళీలు లేవు.. రోగాలొస్తన్నాయ్.. జ్వరం బారిన పడి మేం చస్తున్నాం.. ఇప్పుడా వచ్చేది సారూ..' అంటూ చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌ను మండలంలోని కొల్లూర్ గ్రామస్తులు నిలదీశారు. మండలంలోని కొల్లూర్ గ్రామంలో జ్వరాలు ప్రబలుతుండగా బుధవారం ఎమ్మెల్యే గ్రామాన్ని సందర్శించారు. ఎమ్మెల్యే తన వాహనంలో తిరుగు ప్రయాణం కాగా మహిళలు వివేక్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. తమ గ్రామంలో రోడ్లు లేవని, డ్రెయినేజీలు లేవని, మురికి నీరు రోడ్లపై పారుతుండడంతో రోగాలు వస్తున్నాయని తెలిపా రు. జ్వరాల తీవ్రత పెరగడంతో చనిపోయే స్థితికి వస్తున్నామని, రోజూ తమ గ్రామానికి అంబులెన్స్ వచ్చి జ్వరం వచ్చిన వారిని చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్తోందని పేర్కొన్నారు. గ్రామంలో వైద్య శిబిరాన్ని సందర్శించిన సమయంలో కొందరు గ్రామస్తులు రుణమాఫీ కాలేదని ప్రశ్నించగా.. మరి కొందరు తమ బ్యాంకు ఖాతాలో గ్యాస్ డబ్బులు పడడం లేదని తెలిపారు. దీంతో సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పి వచ్చిన ఐదు నిమిషాల్లో ఎమ్మెల్యే వెనుదిరిగి వెళ్లిపోయారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఏసీపీ రవికుమార్

తాండూర్: గంజాయి, మాదక ద్రవ్యాలపై విద్యార్థులు సరైన అవగాహన పెంచుకోవాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ అన్నారు. బుధవారం తాండూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ గంజాయి ఇతర రకాల మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం అధోగతి పాలవుతుందని అన్నారు. ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు శ్రద్ధగా వింటూ తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. గంజాయి నిర్మూలన లక్ష్యంగా పాఠశాలల్లో ప్రహరీ క్లబ్(యాంటీ డ్రగ్స్ కమిటీ)లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉపన్యాస, వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సీఐ కుమారస్వామి, ఎంఈవో ప్రభాకర్‌రావు, తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్, విద్యాభారతి కరస్పాండెంట్ సురభి శరత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుంటలో పడి మహిళ మృతి

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి గ్రామానికి చెందిన బంటు రుకుంబాయి (50) బుధవారం కూలీ పనికి వెళ్తూ కుంటలో పడి చనిపోయింది. ఎస్సై ఇస్లావత్ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రుకుంబాయి స్థానికంగా వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. బుధవారం కూలీ పనికి వెళ్తుండగా కస్తూరిబా విద్యాలయం సమీపంలోని ఉల్లాజీ వ్యవసాయ కుంట దాటుతుండగా ఫిట్స్ రావడంతో అందులో పడిపోయింది. నీటమునిగి చనిపోయింది. మృతురాలి భర్త బంటు చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

దొంగతనం కేసులో జైలు

రామకృష్ణాపూర్: దొంగతనానికి పాల్పడ్డ నదీమ్ అన్సారీ అనే వ్యక్తికి తొమ్మిది నెలల జైలుశిక్ష విధిస్తూ మంచిర్యాల ప్రిన్సిపల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ సంపత్ బుధవారం తీర్పునిచ్చారని పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. గత మే నెలలో క్యాతనపల్లి క్రాస్‌రోడ్డు వద్ద గల రాయలింగు ఇంట్లో చోరీకి పాల్పడి బంగారం, వెండి అపహరించిన కేసులో నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి తొమ్మిది నెలల జైలుశిక్ష విధించారని పేర్కొన్నారు.

ఆటోలో నుంచి పడి ఒకరు మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం దొనబండ శివారులో బుధవారం ఆటోలో నుంచి పడి ఒకరు మృతి చెందారు. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ కథనం ప్రకారం.. బెల్లంపల్లికి చెందిన పులి మూర్తి(38) కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో వేములవాడకు వెళ్లి తిరుగు పయణమయ్యారు. దొనబండ శివారులో బంధువు, డ్రైవర్ సురేశ్ వేగంగా వెళ్తున్న ఆటోను ఒక్కసారిగా ఎడమవైపుకు తిప్పడంతో వెనక కూర్చున్న మూర్తి అదుపు తప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య జ్యోత్స్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కలప స్వాధీనం



కలప స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కోటపల్లి: ప్రాణహిత నది ద్వారా తరలిస్తున్న కలపను అటవీ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని జనగామ గ్రామ సమీపంలో అక్రమంగా కలప తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారం మేరకు అధికారులు బుధవారం గస్తీ నిర్వహించారు. మధ్యాహ్నం కలప దుంగలను ప్రాణహిత నదిపై తెప్పలుగా తరలిస్తుండగా పట్టుకున్నారు. అనంతరం ఎఫ్‌డీవో సర్వేశ్వర్, ఎఫ్ఆర్వో సదానందంలు దుంగలను పరిశీలించారు. 29 టేకు దుంగలు లభ్యం కాగా వాటి విలువ రూ.2లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. డిప్యూటీ రేంజర్ పాషా, బీట్ ఆఫీసర్ రాజేందర్ ఉన్నారు.

క్రీడా కెరటాలు..!

- సత్తా చాటుతున్న స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం



ఆదిలాబాద్‌లోని క్రీడా పాఠశాల

ఆదిలాబాద్: ప్రస్తుతం చదువులకు ఉన్న ప్రాధాన్యత క్రీడలకు దక్కడం లేదు. దీంతో సామర్థ్యం ఉన్నా విద్యార్థులు, యువత క్రీడలకు దూరమవుతున్నారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని, ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్రంలో హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడాపాఠశాలలను నిర్మించింది. సత్తా ఉన్న విద్యార్థులకు విద్య బోధన చేస్తూనే క్రీడల్లో వారిని మెరికల్లా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేసింది. కాగా ఈ పాఠశాలల్లోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి వివిధ క్రీడా వేదికలపై పతకాలు సాధిస్తున్నారు. పలు క్రీడాంశాల్లో గొప్ప నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ భారత క్రీడా ఉజ్వల భవిష్యత్తుపై ఆశలు రేపుతున్నారు. నేడు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా భవిష్యత్తు క్రీడాకారుల గురించి 'సాక్షి' కథనం..

జూడోలో అలేఖ్య సత్తా



క్రీడా పాఠశాలకు చెందిన కొంపెల్లి అలేఖ్య ప్రస్తుతం పదో తరగతి చదువుతోంది. జూడోలో జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతోంది. వరంగల్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్‌ఐ) రాష్ట్రస్థాయి పోటీల్లో -55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించింది. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ చాంపియన్‌షిప్ పోటీల్లో రజత పతకంతో మెరిసింది. కేరళలోని త్రిసూర్‌లో నవంబర్‌లో గత సంవత్సరం జరిగిన సౌత్ జోన్ ఎస్జీఎఫ్‌ఐ పోటీల్లో గోల్డ్‌మెడల్ పొందింది. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చినందుకు జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన ఎస్జీఎఫ్‌ఐ జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా -గోవా కేంద్రంలో ప్రత్యేక శిక్షణకు ఎంపికైంది. ప్రస్తుతం గోవాలో శిక్షణ తీసుకుంటుంది.

రేస్‌వాక్‌లో మెరిక



క్రీడా పాఠశాలకు చెందిన స్ఫూర్తి అథ్లెటిక్స్‌లో భాగమైన రేస్ వాక్ ఈవెంట్‌లో సత్తా చాటుతోంది. రేస్ వాక్ ఈవెంట్‌లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ -2023 పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. అదే సంవత్సరం హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహించింది. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లోనూ ప్రాతినిధ్యం వహించి శభాష్ అనిపించుకుంది.

బాక్సింగ్ ఆశా కిరణం షోయబ్



క్రీడా పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న షోయబ్ మాలిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చుతున్నాడు. ఈ ఏడాది హైదరాబాద్‌లోని లాలాగూడలోని రైల్వే స్టేడియంలో జరిగిన తెలంగాణ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో 52 -55 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్‌తో మెరిశాడు. నోయిడాలో జరిగిన మూడవ సబ్ జూనియర్ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు. జాతీయస్థాయి క్రీడాకారుడిగా ఎదగడమే లక్ష్యమని షోయబ్ పేర్కొంటున్నాడు.

పతకాల ఆనంది



పదవ తరగతి చదువుతున్న ఆనంది 400 మీటర్ల పరుగుల పోటీల్లో విజేతగా నిలుస్తోంది. 2023లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ పోటీల్లో 400 మీటర్ల ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచింది. అదే సంవత్సరం హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది. 2023లోనే హన్మకొండలో జరిగిన ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీల్లో 600 మీటర్ల ఈవెంట్‌లో రజత పతకంతో రెండో స్థానంలో నిలిచింది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జరిగిన ఎస్జీఎఫ్‌ఐ జాతీయ స్థాయి పోటీల్లో 600 మీటర్ల ఈవెంట్‌లో ప్రాతినిధ్యం వహించింది. ఇటీవల సరూర్‌నగర్ స్టేడియంలో మూడవ జాతీయ జావెలిన్ దినోత్సవం పురస్కరించుకొని జరిగిన పోటీల్లో 400 మీటర్ల ఈవెంట్‌లో స్వర్ణ పతకంతో మెరిసింది.

పరుగుల యువ'రాజ్'



క్రీడా పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న యువరాజ్ 100 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. 2023లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిన సౌత్ జోన్ పోటీల్లో 100 మీటర్ల ఈవెంట్‌లో కాంస్య పతకం గెలిచాడు. అదే సంవత్సరం హన్మకొండలోని జవహర్ లాల్‌నెహ్రూ స్టేడియంలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించాడు.

కళాశాలల ప్రిన్సిపాళ్ల కార్యవర్గం ఎన్నిక

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం ఎన్నికలు బుధవారం జరిగాయి. ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా శంకర్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల, కాసిపేట్), ప్రధాన కార్యదర్శిగా అంజయ్య, జీజేసీ (బాయ్స్) బెల్లంపల్లి, ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్‌రావు (లక్సెట్టిపేట్), మహిళ కార్యదర్శులుగా స్వరూప (బెల్లంపల్లి, గర్ల్స్ కళాశాల) ఎన్నికయ్యారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య



గుగ్గె కిరణ్ (ఫైల్)

జైనూర్: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జైనూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం ఇచ్చోడ మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన గుగ్గె కిరణ్(26) గత ఐదేళ్ల నుంచి వ్యాపారం కోసం కెరమెరిలో నివాసముంటున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కారణంగా అప్పుల పాలవడంతో పాటు మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 21న బైక్ ఫైనాన్స్ డబ్బులు కట్టడానికి వెళ్తున్నట్లు చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. సాయంత్రం 4 గంటల సమయంలో భార్య శీతల్‌కు ఫోన్ చేసి పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకొని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కాగా అక్కడే చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. శీతల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పీవోడబ్ల్యూ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: హైదరాబాద్‌లో ఆగస్టు 31, సెప్టెంబర్ 1, 2 తేదీల్లో జరుగనున్న ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర ఏడవ మహాసభల వాల్ పోస్టర్లను బుధవారం శ్రీరాంపూర్‌లోని సింగరేణి సివిల్ కార్యాలయం మైదానం వద్ద సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జ్యోతి ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అరాచకాలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారంపై మహాసభలో చర్చించి పలు తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. నాయకురాళ్లు శిరీష, శారద, కవిత, లక్ష్మి, మల్లేశ్వరి, కమలమ్మ, విజయ, స్వప్న పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత



సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: ఏరియా పరిధిలో పనిచేస్తున్న కన్వేయన్స్ డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యాజమాన్యానికి సమ్మె నోటీసు అందజేశారు. బుధవారం సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయా గనులపై అధికారులకు సమ్మె నోటీసులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కనీస వేతనాలు అందక ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నామని, తమ వేతనాల నుంచి సీఎంపీఎఫ్ కట్ చేసేందుకు యాజమాన్యం ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు. సెప్టెంబర్ 11లోగా యాజమాన్యం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

అక్రమంగా పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత

వాంకిడి: మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు పశువులను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని సరాండి టోల్‌ప్లాజా వద్ద డీఎస్పీ సదయ్య ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించగా అనుమతులు లేకుండా కంటైనర్ వాహనంలో పశువులను తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కంటైనర్‌లో 14 పశువులు ఉండగా వ్యాపారులు అబ్దుల్ అజీజ్, మీర్జా ముజాహిద్, షేక్ జాహిద్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించామన్నారు. తనిఖీల్లో ఏఎస్సై పోశెట్టి ఉన్నారు.

బాలికను వేధించిన బాలుడి అరెస్ట్

మంచిర్యాలక్రైం: బాలికపై లైంగిక దాడికి పాల్పడి వేధిస్తున్న బాలుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు స్థానిక సీఐ బన్సిలాల్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన తల్లి లేని మైనర్ బాలిక (17)ను మైనర్ బాలుడు గత కొంత కాలంగా వేధిస్తున్నాడు.బాలికకు మాయమాటలు చెప్పి పలుమార్లు అత్యాచారం చేశాడు. బాలిక ఫిర్యాదు మేరకు మైనర్ బాలుడినిఅదుపులోకి తీసుకొని రిమాండ్ నిమిత్తం న్యాయస్థానం ముందుహాజరుపర్చినట్లుసీఐ పేర్కొన్నారు.

తప్పిన ప్రమాదం

ఆసిఫాబాద్అర్బన్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బుధవారం సిద్దిపేట పరిసర ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. వివరాల్లోకి వెళ్తే బుధవారం ఉదయం 8 గంటలకు బస్సు హైదరాబాద్ బస్‌స్టేషన్ నుంచి ఆసిఫాబాద్‌కు బయలు దేరింది. 10 గంటల సమయంలో సిద్దిపేట ప్రాంతానికి చేరుకోగా అక్కడ రాంగ్‌రూట్‌లో వస్తున్న టూవీలర్‌ను తప్పించబోయి డ్రైవర్ అలీ డివైడర్‌పైకి ఎక్కించారు. ప్రమాద సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం తృటిలో తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

నిధులొచ్చాయ్..!

- వృత్తివిద్య కోర్సుల కోసం విడుదల
- ఉమ్మడి జిల్లాలోని 29 పాఠశాలల్లో కోర్సులు అమలు



వృత్తివిద్య కోర్సులపై అవగాహన కల్పిస్తున్న శిక్షకురాలు

మంచిర్యాలఅర్బన్: జాతీయ విద్యావిధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన బడుల్లో నూతన హంగులు సమకూర్చాలనే ఉద్దేశంతో పీఎంశ్రీ అమల్లోకి తెచ్చింది. పాఠశాలస్థాయి నుంచి విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి కల్పనకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో వృత్తివిద్య కోర్సుల అమలుకు చర్యలు చేపట్టింది. ఆయా కోర్సుల్లో శిక్షణ ఇచ్చి విద్యాభ్యాసం పూర్తి కాగానే ఉద్యోగవకాశాలు పొందేలా తోడ్పాటునందించనున్నారు.

29 పాఠశాలల్లో..

రాష్ట్రంలోని 88 కేజీబీవీలు, 14 గురుకుల విద్యాలయాల్లో 2023 -24 విద్యా సంవత్సరంలో వృత్తివిద్య కోర్సులు ప్రారంభమయ్యాయి. ఇందులో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 29 పాఠశాలల్లో వృత్తివిద్య కోర్సులకుగాను నిధులు విడుదలయ్యాయి. ప్రస్తుతం మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులు బోధిస్తుండగా సామగ్రి, విద్యార్థుల బోధనకు అవసరమైన పరికరాల కొనుగోలుకు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ఎన్ఎస్‌డీసీ సహకారంతో..

జాతీయ నైపుణ్య అభివృద్ధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ) సహకారంతో వృత్తివిద్య కోర్సులను ఆయా పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. వృత్తివిద్య కోర్సుల నిర్వహణ వొకేషనల్ ట్రైనింగ్ పార్టనర్స్(వీటీపీ)కు అప్పగించారు. ఆయా సంస్థల నిపుణులైన శిక్షకులను నియమించి తరగతులు ప్రారంభించారు. పదోతరగతి వరకు ఉన్న పాఠశాలల్లో రెండు దశల్లో కోర్సులు అమలు చేస్తున్నారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు లెవల్ -1 పేరిట విలువైన సమయాన్ని వృథా చేయకుండా వృత్తివిద్య కోర్సులు బోధిస్తున్నారు. రెండో దశలో విద్యార్థులు కిందటి తరగతిలో పేర్కొన్న కోర్సుకు తగిన శిక్షణ, క్షేత్రస్థాయి అవగాహన కల్పిస్తున్నారు. మిగితా రెండు దశలను ఇంటర్మీడియెట్ వరకు ఉన్న విద్యాసంస్థల్లో అమలు చేయనున్నారు. విద్యార్థులు సులభంగా నేర్చుకునేలా వ్యవసాయం, బ్యూటీపార్లర్, దుస్తులు మేడ్ అప్‌లు, గృహోపకరణాల అలంకరణ, బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఐటీ టెక్నాలజీ, ప్లంబర్, క్రీడలు, ఫిజికల్ ఎడ్యుకేషనల్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. కోర్సులకు అవసరమైన సామగ్రి కొనుగోలుకు, పాఠశాల విద్యార్థులకు అవసరమైన జిరాక్స్‌లు తీసుకునేందుకు నిధులు మంజూరయ్యాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిధుల వివరాలు

జిల్లా	పాఠశాలల సంఖ్య	సామగ్రి కొనుగోలు	జిరాక్స్ (వర్క్‌బుక్స్, హ్యాండ్‌బుక్స్)
ఆదిలాబాద్	06	రూ.2,35,000	రూ.45,000
కుమురంభీం	07	రూ.1,88,000	రూ.35,000
మంచిర్యాల	12	రూ.4,23,000	రూ.70,000
నిర్మల్	04	రూ.1,41,000	రూ.25,000

కోలిండియా స్థాయిలో రాణించాలి



పోటీలు ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: ఏరియా క్రీడాకారులు కోలిండియా స్థాయి పోటీల్లో రాణించాలని శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో ఏరియాస్థాయి వార్షిక క్రీడలు ప్రారంభమయ్యాయి. శ్రీనివాస్ మాట్లాడుతూ ఆటల వల్ల పోటీతత్వం పెరుగుతుందని, కొత్త స్నేహాలు చిగురిస్తాయని పేర్కొన్నారు. కంపెనీ క్రీడలకు, క్రీడాకారులకు కావాల్సిన సకల సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. ఏరియా ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి పాల్ సృజన్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, కోఆర్డినేటర్ నరసయ్య, జనరల్ కెప్టెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి చేనులో గంజాయి సాగు



గంజాయి మొక్కలు పరిశీలిస్తున్న ఎస్సై

కెరమెరి: మండలంలోని దేవుడ్‌పల్లి గ్రామానికి చెందిన తొక్సెండే పోచిరాం పత్తి చేనులో గంజాయి సాగు చేస్తున్నట్లు గుర్తించామని ఎస్సై గంపుల విజయ్ తెలిపారు. అందిన సమాచారం మేరకు బుధవారం పోచి రాం చేనులో పరిశీలించగా 30 గంజాయి మొక్కలను గుర్తించామన్నారు. వాటి విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టుకు ఎంపిక



సందీప్‌రెడ్డి

చెన్నూర్‌రూరల్: మండలంలోని ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి సందీప్‌రెడ్డి వెటర్నరీ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి సమ్మక్క -రాజిరెడ్డిల కుమారుడు సందీప్‌రెడ్డి తన విద్యాభ్యాసం మొత్తం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పూర్తి చేశాడు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని పీవీ నరసింహారావు కళాశాలలో వెటర్నరీ సైన్స్ కోర్సు పూర్తి చేశాడు. అనంతరం వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులకు నోటిఫికేషన్ రాగా 2023లో పరీక్ష రాసి పోస్టుకు ఎంపికయ్యాడు.

షాపింగ్‌మాల్స్‌పై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని షాపింగ్‌మాల్స్‌పై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు ఆయన చాంబర్‌లో వినతిపత్రం అందజేశారు. షాపింగ్ మాల్స్ వద్ద పార్కింగ్ స్థలం లేక వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. అధికారులు స్పందించి షాపింగ్ మాల్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు గోపాల్, క్రాంతికుమార్, ప్రవీణ్‌కుమార్, నితీశ్ పాల్గొన్నారు.